వేరుశనగ సాగుపై వెనకడుగు!



తాడిమర్రిలోని రైతు భరోసా కేంద్రం



రైతులకు దక్కని భరోసా..

- ప్రభుత్వం నుంచి రైతుకు అందని పెట్టుబడి సాయం
- మండలానికి చేరని సబ్సిడీ విత్తనకాయలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

తాడిమర్రి: గతంలో మే, జూన్ మాసాలు వచ్చాయంటే గ్రామాల్లో వ్యవసాయ పనులతో రైతులు బిజీబిజీగా ఉండే వారు. మండలంలోని గ్రామాల్లో ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు రైతులు రెండు నెలల ముందు నుంచే కావాల్సిన వనరులు సమకూర్చుకునేవారు. తొలకరి జల్లులు, వర్షాలు కురవగానే మగవారు పొలాల్లో సేద్యపు పనుల్లో, మహిళలు వేరుశనగ విత్తన కాయలు వలువడం లాంటి పనులతో బిజీబిజీగా ఉండేవారు. అయితే ప్రస్తుతం గ్రామాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఏ గ్రామంలోనూ అలాంటి దృశ్యాలు మచ్చుకైనా కనిపించడం లేదు. సేద్యపు పనులు చేయకపోవడంతో చాలా చోట్ల భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా సాయం, విత్తన సబ్సిడీ తగ్గడంతో రైతులు వేరుశనగ సాగుకు ముందుకు రావడం లేదు. గతంలో మండలంలో సుమారు 12 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు అవుతుండగా సుమారు 9 వేల క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేసేవారు. అయితే గతేడాది కేవలం 6 వేల హెక్టార్లు విస్తీర్ణానికి పరిమితం కాగా కేవలం 3 వేల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఎన్నో ఆశలతో పంటను సాగు చేసిన రైతులకు పంట నిరాశను మిగిల్చింది. విత్తనం వేసిన తర్వాత సకాలంలో వర్షాలు కురవక పోవడంతో పంట పండకుండా రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం ప్రభుత్వం పంట నష్టపరిహారం కూడా అందించలేదు. ఈ ఏడాది మే నెల పూర్తి కావొస్తున్నా ఇప్పటికీ విత్తన వేరుశనగ మండలానికి చేరలేదు. ఎలాగైనా పంట వేయక తప్పదు అనే రైతులు సబ్సిడీ విత్తనం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సబ్సిడీ విత్తనం అందించడంతో పాటు పంట పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు.

సబ్సిడీ వేరుశనగ కోసం ఎదురు చూస్తున్నాం



వేరుశనగ పంట సాగు కోసం ప్రభుత్వ అందించే సబ్సిడీ విత్తనం కోసం ఎదురు చూస్తున్నాం. నాకున్న ఆరు ఎకరాల్లో పంట సాగు చేయాలంటే ఆరు మూటల విత్తనం కావలసి వస్తుంది. ప్రభుత్వం వెంటనే సబ్సిడీ విత్తనంతోపాటు పెట్టుబడుల కోసం ఆర్థికసాయం అందించాలి.
–మల్లెల రామయ్య, రైతు, రామాపురం, తాడిమర్రి

90 శాతం సబ్సిడీతో విత్తనం అందించాలి



గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది రైతులు పంటలు పెట్టాలంటే రైతుల వద్ద విత్తనం లేదు. రైతుల వద్ద డబ్బు కూడా లేదు. ప్రభుత్వం వెంటనే 90 శాతం సబ్సిడీ విత్తనంతో పాటు పంట పెట్టుబడి సాయం అందించాలి.
–బీసాని లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడిమర్రి మండల కార్యదర్శి

వచ్చే వారం నుంచి పంపిణీ



మండలంలో వచ్చే వారం నుంచి రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. మండలంలోని పది రైతు సేవా కేంద్రాల వద్ద విత్తన పంపిణీ ఉంటుంది. గత కొన్నేళ్లుగా మండలంలో వేరుశనగ సాగు తగ్గుతుండటంతో ఈ ఏడాది మండలానికి 1,815 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కేటాయించారు.
–రమాదేవి, ఏఓ, తాడిమర్రి

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లి క్వార్టర్స్‌కు చెందిన రామచంద్ర శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ రూ. 15 వేలు అందించారు. ఈ మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న లక్ష్మీనరసింహస్వామి

తాడిమర్రి: ఏకపాదంపల్లిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్ప మాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. అలాగే ఆలయం పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేయాలి

ఓడీచెరువు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు సేద్యపు పనులు ప్రారంభించారన్నారు. ఖరీఫ్‌లో విత్తన పంపిణీకి ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. మరోవైపు ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కూడా అందించలేదన్నారు. సకాలంలో విత్తన వేరుశనగ పంపిణీ చేయడంతోపాటు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, వి.వి.రమణ మండల కన్వీనర్ కుళ్లాయప్ప, గంగులప్ప, రైతులు రామకృష్ణ,శంకర్, అనంత్,రామాంజి, కొండప్ప, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల పంపిణీ



ప్రజలకు ఉచితంగా మందులు అందిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ధర్మవరం అర్బన్: సత్యసాయిబాబా నారాయణ సేవలో భాగంగా శనివారం సుబ్బదాసు సత్రంలో ప్రజలకు అన్నదానం చేశామని సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా సుబ్బదాసు సత్రంలో పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేస్తున్నామని సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, వెంకటేష్, నాగిరెడ్డి, శేషాద్రి, కాకుమాని సాగర్ తదితరులు తెలిపారు.

పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

తనకల్లు: మండలంలో ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంతలపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్ 183–ఏలో 4.28 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో అక్కడ సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు కూడా లేని 150 మంది పేదలు జెండాలను పాతి ఇంటి పట్టాలు ఇవ్వాలని విన్నవించుకున్నట్లు తెలిపారు. ఐదేళ్లు గడచినా ఇంతవరకు అర్హులైన పేదలకు మాత్రం పట్టాలను అందజేయలేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరిప్ప, మండల నాయకులు రెడ్డెప్ప, చౌడప్పయాదవ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లంబర్లకు న్యాయం జరిగేదాకా పోరాటం



రిలేదీక్షలు చేస్తున్న సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు

ధర్మవరం: ప్లంబర్లకు న్యాయం జరిగేదాకా పోరాటం ఆగదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ సంఘం చేపట్టిన రిలే దీక్షలు శనివారం ఐదో రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడుతూ 650–2 సర్వేనంబర్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఆర్డీఓ స్పందించి 650–2 సర్వేనెంబర్‌లో దొంగ పట్టాలను రద్దు చేసి అర్హులైన ప్లంబర్స్‌కు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, నేతలు తాజుద్దీన్, రామకృష్ణ, రామసుబ్బయ్య, సురేంద్ర, మసూద్, వేణుగోపాల్, ఓబులేసు, నాగేంద్ర, చిన్న, జనార్ధన్, మహిళా సమాఖ్య నేతలు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

హిందూపురం టౌన్: హిందూపురం పట్టణ ప్రజల భద్రత ముఖ్యమని డీఎస్పీ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సీఐలు, ఎస్‌ఐలతో కలసి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో వినాయక శోభాయాత్ర అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. అయితే గత సంవత్సరం శోభాయాత్రలో రెండు పెద్ద విగ్రహాలు పడిపోవడం జరిగిందని గుర్తు చేశారు. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జాయింట్ కలెక్టర్‌తో కలసి పట్టణంలో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వినాయక విగ్రహాల ఎత్తును తగ్గించేలా అందులో చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే త్వరలోనే వినాయక మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం చర్చించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు కూడా ఎక్కువ ఎత్తులో విగ్రహాలను ఏర్పాటు చేయరాదని సూచించారు. ప్రజల భద్రత, ఊరేగింపు సాగే రోడ్లు తదితర వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వినాయక ఉత్సవం వైభవంగా సాగేలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు వినాయక మండప నిర్వాహకులు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జవహర్ నవోదయ విద్యాలయంలో యోగా చేస్తున్న అభ్యాసకులు

అమరాపురం: ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని కార్యదర్శి ఈరన్న తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ యోగా సాధన చేయాలన్నారు. తద్వారా మనశ్శాంతితో పాటు మనం చేసే పనిపై ఏకాగ్రత ఉంటుందని పేర్కొన్నారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. యోగా చేస్తే రోగాలు దరి చేరవని తెలిపారు.

జవహర్ నవోదయ విద్యాలయలో..

లేపాక్షి: ప్రజలు యోగా అభ్యసనం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగాతో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గిపోతుందని తెలిపారు.

ఖైదీల్లో మార్పు రావాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: క్షణికావేశంలో తప్పులు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో గదులు, మరుగుదొడ్లు, వంటగది, నిత్యావసరాలు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చేసిన నేరం, ఎంతకాలంగా శిక్ష అనుభవిస్తున్నారు? ఖైదీలకు ఇస్తున్న ఆహారం నాణ్యత తదతర వివరాలపై ఆరా తీశారు. జైలు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారా, వైద్య సౌకర్యాలు అందుతున్నాయా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సబ్‌జైలులో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడారు. తప్పు చేసి జైళ్లకు రావడం వల్ల సమాజంలో కుటుంబ సభ్యుల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లుతుందన్నారు. సబ్‌జైలులో ఫిర్యాదుల పెట్టె సక్రమంగా లేదని.. వెంటనే ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని జైలర్ హనుమన్నను ఆదేశించారు. ఖైదీల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన ఖైదీలు ఉంటే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాంటి వారికి ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, పార్వతి, భరత్ సింహా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆహ్వానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ధర్మవరం: పట్టణంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆహ్వానించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని వడ్డెర సంఘం అధ్యక్షుడు డేరంగుల అంజి ఆహ్వాన పత్రికను అందించారు. జూన్ 2న సెరికల్చర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణకు రావాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం గౌరవాధ్యక్షుడు డేరంగుల నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి మల్లెల దివాకర్, యూత్ ఉపాధ్యక్షుడు డేరంగుల శివరాం, కోఆపరేటర్ రాజేష్, యువత ప్రధాన కార్యదర్శి మల్లెల నారాయణస్వామి, మల్లెల శ్రీనివాసులు, కుంచపు రామంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పెనుకొండ: శ్రీసత్యసాయి జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల కమిటీ జిల్లా కార్యదర్శి శివయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని స్థానిక మిట్టాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పురస్కారాల కోసం విద్యార్థుల జాబితాను సిద్ధం చేయడం జరిగిందన్నారు. అర్హత ఉండి పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ద్విచక్ర వాహనం

లేపాక్షి: చోళసముద్రం సమీపంలోని జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం బజాజ్‌ప్లాటినా (ద్విచక్ర వాహనం) దగ్ధమైంది. వివరాలు.. కొడికొండ–శిరా 544ఈ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అకస్మాత్తుగా సైడ్ బ్యాగ్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ద్విచక్ర వాహనదారుడు కిందకు దిగడంతో ప్రమాదం తప్పింది. దగ్ధమైన వాహనం కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన రామక్రిష్ణకు చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



అలంకరణలో లక్ష్మీదేవి సమేత నరసింహుడు

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు మొదలుకుని అంకురార్పణ, అష్టోత్తర నామాలు, విష్ణుసహస్ర నామాలు, తులసీ పూజ చేశారు. అనంతరం లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులు కానుకల రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, పూలతో పాటు వెండి, బంగారు ఆభరణాలతో స్వామిని అలంకరించారు. కర్ణాటక ప్రాంతాల నుంచి స్వామిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందించారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఒంటిపాళ్యం గ్రామానికి చెందిన రంగప్ప ఆస్తి తగాదాలతో మనస్థాపానికి గురై శనివారం ఇంటి సమీపంలో విష ద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే రంగప్పను చికిత్స నిమిత్తం మడకశిర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రంగప్ప ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

29న కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ధర్మవరం: పట్టణంలోని యశోదమ్మ వకీలుపెద్దయ్య కురుబ కల్యాణ మండపంలో కురుబ విద్యార్థులకు ఈనెల 29న ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు కల్యాణ మండపం కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన కురుబ విద్యార్థులు రెండురోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, కమిటీ డైరెక్టర్లు, కమిటీ సభ్యులు, కురుబ కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ పరికరాల చోరీ

కనగానపల్లి: వ్యవసాయ పొలంలోని విద్యుత్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు శ్రీనాథ్ తెలిపిన వివరాల మేరకు...కనగానపల్లిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న తన వ్యవసాయ పొలంలో శ్రీనాథ్ ఇటీవలే కొత్తగా బోరువేసి మోటరు అమర్చుకున్నాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మోటరుకు అమర్చిన స్టాటర్ పెట్టె, కేబుల్ ఎత్తుకెళ్లారు. చోరీ అయిన సామగ్రి విలువ రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ధ్యానం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానం నేర్పిస్తున్న గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి

ధర్మవరం అర్బన్: రోజూ ధ్యానం, యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి పేర్కొన్నారు. పట్టణంలోని జగజ్జీవన్‌రామ్‌నగర్‌లో నున్న గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు ధ్యానం, యోగాపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శాకాహార ర్యాలీ

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శ్రీహరిహర పిరమిడ్ ధ్యాన మందిరం కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం బత్తలపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ధ్యాన మందిరం వద్ద నుంచి సుమారు 200 మంది ధ్యానుల సమక్షంలో 108వ శాకాహార ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు ధ్యాన సందేశాలు ఇస్తారన్నారు.మాల్యవంతం సీనియర్ పిరమిడ్ ధ్యాన మాస్టర్ వెంకటనారాయణ మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాలలో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం సాయంత్రం రావులచెరువు గ్రామంలో సిబ్బందితో కలిసి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, పేకాట వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో రస్తా విషయమై గొడవ పడుతుండగా ఇరువర్గాలను పిలిపించి సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులతో సర్వే చేయించుకోవాలన్నారు. ఎటువంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యోగా సర్వే పూర్తి చేయండి

అమడగూరు: యోగా సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ మునెప్ప పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన సర్వేను వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఈ సర్వే వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయం-2లో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథగుప్తా

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం–2 ను ఎంపీడీఓ రఘునాథ గుప్తా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ విజయకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధుశ్రీ సెలవు తీసుకోకుండా విధులకు గైర్హాజర య్యారని గుర్తించిన ఎంపీడీఓ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని ఇద్దరు ఉద్యోగులను ఎంపీడీఓ ఫోన్‌లో సంప్రదించగా వారి నుంచిఎలాంటి స్పందనా రాలేదు. విధులకు డుమ్మా కొట్టిన విజయకాంత్ రెడ్డి, మధుశ్రీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.